# ముకుందమాల

MUKUNDA MALA

# ముకుందమాల



జీవితమంతా శ్రీమన్నారాయణుని భక్తి సామ్రాజ్యములో మునిగి తేలి, ఈ జన్మను ఆ స్వామి సేవకే అంకితం చేసిన, 12 మంది ఆళ్వారులలలో, శ్రీకులశేఖరాళ్వారులు ఒకరు. ఆయన క్రీ. శ 800 సంవత్సరములో జన్మించారని తెలుస్తున్నది.

ఆయన తిరుమల శ్రీనివాస పెరుమాళ్ళను ఈ క్రింది విధముగా వేడుకున్నాడట. నీ దివ్య సన్నిధి ముందు రాతి గడప/కడప (తమిళంలో పడి అంటారు) ఎంతో అదృష్టం చేసుకుంది. ఎందుకంటే సదా నీ దివ్య మంగళ శాలగ్రామ స్వరూపమును దర్శనం చేసుకునే భాగ్యం దానికి ఉంది. నేనైనా, నీ సన్నిధి గడపను అయ్యే భాగ్యాన్ని ప్రసాదించు, అని వేడుకు  డట.

అందుకే, తిరుమలలో స్వామి సన్నిధి ముందు వున్న రాతి గడపను, "కులశేఖర పడి (గడప)" అంటారు.

ఆయన రచించిన ముకుంద మాల స్తోత్ర రత్నములను మొత్తము తాత్పర్య సహితంగా అందుకుందాము.

**ఘుష్యతే యస్య నగరే రంగ యాత్రా దినే దినే ।**

**తమహం శిరసా వందే రాజానాం కులశేఖరమ్ ॥**

**శ్రీవల్లభేతి వరదేతి దయాపరేతి**

**భక్తప్రియేతి భవలుణ్ఠన కోవిదేతి |**

**నాథేతి నాగాశయనేతి జగన్నివాసే**

**త్యాలాపనం ప్రతిపదం కురు మే ముకున్ద ||** 1

తా. ఓ శ్రీ కృష్ణా! శ్రీ వల్లభా! వరదా! దయాపరా! భక్తప్రియా! భవ బంధాలను త్రెంపివైచే కోవిదుడా! నాథా! నాగశయనా! జగన్నివాసా! నేను ఎల్లప్పుడూ నీ నామాలను ఆలపించేటట్లుగా చేయి స్వామీ!

**జయతు జయతు దేవో దేవకీనందనోయం**

**జయతు జయతు కృష్ణో వృష్ణివంశప్రదీపః ।**

**జయతు జయతు మేఘశ్యామలః కోమలాంగోః**

**జయతు జయతు పృథ్వీభారనాశో ముకుందః ॥** 2

తా. దేవకీ కుమారుడైన దేవదేవునికి జయము జయము! వృష్ణి వంశ ప్రదీపుడైన శ్రీ కృష్ణునికి జయము! మేఘశ్యామలుడు, కోమలాంగుడూ అయిన శ్రీకృష్ణ భగవానునికి జయము జయము! భూమాత భారాన్ని తగ్గించడానికి అవతరించిన ముకుందునికి జయము జయము!

**ముకుంద మూర్ధ్నా ప్రణిపత్య యాచే**

**భవంతమేకాంత మియం తమర్థం ।**

**అవిస్మృతిః త్వచ్చరణారవిందే**

**భవేభవే మేస్తుభవత్ప్రసాదాత ॥** 3

తా. ఓ ముకుందా! నీకు శిరసు వంచి నమస్కరిస్తూ యాచిస్తున్నా. నా మీద దయవుంచి నా ఈ చిన్న విన్నపాన్ని అలకించు. నేను ఎన్ని జన్మలనెత్తినా నీ పాదారవిందములపై నా మనస్సు నిలిచి ఉండేట్లు అనుగ్రహించు స్వామి!

**నాహం వందే తవ చరణయోర్ద్వంద్వ మద్వందహేతోః**

**కుంభీపాకం గురుమపి హరే నారకం నాపనేతుం ।**

**రమ్యా రామా మృదుతనులతా నందనే నాపి రంతుం**

**భావే భావే హృదయభవనే భావయేయం భవంతం ॥** 4

తా. ఓ కృష్ణా! ద్వంద్వాతీతస్థితిని అందుకోవలెనని కాని, కుంభీపాక నరకమును తప్పించుకోవలెనని కాని, లావణ్యవతులగు అప్సరసలను స్వర్గములో అనుభవింపవలెనని కాని, నీ పాదారవిందములకు నమస్కరించుట లేదు. ఏ దేహము ఇచ్చినా, అభ్యంతరము లేదు. కానీ సర్వదా మనసులో నిన్నే స్మరించునట్లు చేయమని నమస్కరించుచున్నాను.

**నాస్థా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే**

**యద్యద్భవ్యం భవతు భగవన్ పూర్వకర్మానురూపం ।**

**ఏతత్ ప్రార్థ్యం మమ బహుమతం జన్మజన్మాంతరేపి**

**త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తి రస్తు ॥** 5

తా. ఓ కృష్ణా! ధర్మమును ఆర్జించవలెనని గాని, అర్థమును కూడబెట్టవలెనని గాని, కామములను అనుభవించ వలెనని గాని నాకు కోరిక లేదు. నా పూర్వకర్మములను అనుసరించి ఏది ఎలా జరగవలెనో అలాగే జరుగు గాక. ఈ జన్మయందు గాని, జన్మాంతరమందు గాని, నీ పాదారవిందములయందు గాని, నాకు నిశ్చలమగు భక్తి కలుగవలెననునది ఒక్కటియే నా కోరిక.

**దివి వా భువి వా మమాస్తు వాసః**

**నరకే వా నరకాంతక ప్రకామం ।**

**అవధీరిత శారదారవిందౌ**

**చరణౌ తే మరణేపి చింతయామి ॥** 6

తా. ఓ నరకాంతక! కృష్ణా! స్వర్గము నందున్నను, లేదా ఈ భూమి యందే ఉన్నను నాకేమీ బాధ లేదు. కానీ శరత్కాల పద్మ సుందరములగు నీ చరణార విందములనే మరణ సమయమున కూడా ధ్యానించుచుందును.

**కృష్ణ! త్వదీయ పదపంకజ పంజరాంతం**
**అద్యైవ మే విశతు మానసరాజహంసః ।**
**ప్రాణప్రయాణ సమయే కఫవాత పిత్తైః**
**కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే ॥** 7

తా. కృష్ణా! మరణ సమయమున నిన్ను స్మరింతునని అంటిని కానీ, ఆవేళ కఫవాత పైత్యములచే కంఠము మూతపడినప్పుడు నీ స్మరణ కలుగునో కలుగదో తెలియదు కదా! కావున ఇప్పుడే నా మానస రాజహంసము, విరోధులెవ్వరూ చేరలేని వజ్ర పంజరము వలె ఉండు నీ పాదపద్మముల మధ్యమున చేరుగాక!

**చింతయామి హరిమేవ సంతతం**
**మంద మంద హసితాననాంబుజం ।**
**నందగోప తనయం పరాత్పరం**
**నారదాది మునిబృంద వందితం ॥** 8

తా. నారదాదిమునులచే సేవింపబడు, పరాత్పరుని, నందగోపకున్ని, నవ్వురాజిల్లెడి మోముగల, కృష్ణుని సదా ధ్యానింతును.

**కరచరణ సరోజే కాంతి మన్నేత్రమీనే**
**శ్రమ ముషి భుజవీచి వ్యాకులేగాథమార్గే ।**
**హరిసరసి విగాహ్యాపీయ తేజోజలౌఘం**
**భవమరు పరిఖిన్నః ఖేద మద్యత్యజామి ॥** 9

తా. నేను ఈ సంసారమనే, ఎడారిలో ప్రయాణము చేసి, చేసి బడలిక చెంది, ఈ శ్రీహరి అనే సరస్సును చేరితిని. ఆహా! ఈ సరస్సు ఎంత సుందరమైనది! ఆ హరి కరచరణములే మిలమిలలాడు చేపలు. భుజములే అందు కదలాడు కెరటములు. అది శ్రమలనన్నింటిని హరించును. ఆ రేవులు అవగాహనము (స్నానము) చేయుటకు అనుకూలమైన లోతు కలవై ఉండును. అందులోకి పోయి, ఆ తేజస్సు అనే జలమును కడుపు నిండా త్రాగి, నా బడలికను తీర్చుకొనుచున్నాను.

**సరసిజనయనే సశంఖచక్రే**

**మురభిధి మా విరమస్వ చిత్త రంతుం ।**

**సుఖతరమపరం న జాతు జానే**

**హరిచరణ స్మరణామృతేన తుల్యం ॥** 10

తా. ఓ మనస్సా! శ్వేత తామరల లాంటి నయనాలు కలిగి శంఖ చక్రాలను ధరించి దివ్య మంగళ స్వరూపుడైన శ్రీకృష్ణ భగవానుని ఎప్పుడూ స్మరించు. ఆ స్మరణ మానవద్దు. శ్రీహరి పాదపద్మాలను స్మరించడం అనే అమృతానికి సమానమైనది ఇంకోటి ఏదీ లేదు కదా.

**మాభీర్మందమనో విచింత్య బహుధా యామీశ్చిరం**

**యాతనాః నామీనః ప్రభవంతి పాపరిపవః స్వామీ నను శ్రీధరః ।**

**ఆలస్యం వ్యపనీయ భక్తిసులభం ధ్యాయస్య నారాయణం**

**లోకస్య వ్యసనాపనోదనకరో దాసస్య కిం న క్షమః ॥** 11

తా. ఓ మూఢమైన మనసా! యమ యాతనలను పలువిధముల చిరకాలము చింతించి భీతి ందకుము. మన ప్రభువగు శ్రీహరి ఉండగా ఈ పాపములనెడి శతృవులు మనలను ఏమియూ చేయలేవు. కావున భక్తిచే సులభముగా పొందదగు నారాయణుని జాగుచేయక ధ్యానింపుము. లోకములో అందరి ఆపదలను తీర్చువాడు, తనదాసుని ఆపదలు తొలగింపలేడా !

**భవజలధిగతానాం ద్వంద్వ వాతాహతానాం**

**సుతదుహితృ కళత్ర త్రాణభారార్ధితానాం ।**

**విషమవిషయతోయే మజ్జతామప్లవానాం**

**భవతు శరణమేకో విష్ణుపోతో నరాణాం ॥** 12

తా. సంసారమనే సముద్రంలో చిక్కి విరుద్ధ ధర్మములనే గాలిచే కొట్టబడి, భార్యాబిడ్డలు మున్నగువారిని పోషించడమనే బరువును మోస్తూ, విషయసుఖాలనే నీళ్ళలో మునిగి లేస్తూ,నావ లేకుండా నానా యాతనలకు గురి అవుతున్న నరులకు శ్రీమన్నారాయణుడు, అనే నావ ఒక్కటే శరణ్యము.

భవజలధిమగాధం దుస్తరం నిస్తరేయం
కథ మహమితి చేతో మాస్మగాః కాతరత్వం ।
సరసిజదృశి దేవే తావకీ భక్తిరేకా
నరకభిది నిషణ్ణా తారయిష్యత్యవశ్యం ॥ 13

తా. ఓం మనసా, దాటటానికి దుస్సాధ్యమై అగాధమైన ఈ సంసార సాగరాన్ని ఎలా దాటాలని కంగారుపడుతున్నావా? సదా శ్రీహరి పాద పద్మాలపై స్థిరమైన భక్తిని అలవరచుకుంటే అది ఒక్కటే పైరెండిటి నుంచి రక్షిస్తుంది.

తృష్ణాతోయే మదన పవనోద్ధూతమోహోర్మిమాలే
దారావర్తే తనయ సహజగ్రాహ సంఘాకులే చ ।
సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం నస్త్రిధామన్
పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ ॥ 14

తా. ఈ సంసారమనే సముద్రంలో ఆశయే జలము. ఆ జలము కామమనే పెనుగాలిచే కదిలింపబడుచున్నది. ఆ విధంగా కదులుటచే మోహమనే కెరటములు వరుసగా సాగును. ఈ సముద్రములో భార్య సుడి గుండమువలె పట్టి తిప్పి, అందు పడినవారిని బయటకు పోనీయక ముంచును. బిడ్డలు, బంధువులు, మొసళ్ళలాంటి జంతువులవలె కబళింప ప్రయత్నించుదురు. ఈ భయంకరమగు సంసార మహా సముద్రమును, ఏవిధంగా దాటాలో ఉపాయము లేక మునుగు మాకు, ఓ వరదా! ఓ త్రిధామ! నీ పాదపద్మభక్తి అనే నౌకను ఇచ్చి దరిజేర్చవయ్యా.

మాద్రాక్షం క్షీణపుణ్యాన్ క్షణమపి భవతో భక్తిహీనాన్ పదాబ్జే
మాశ్రౌషం శ్రావ్యబంధం తవ చరితమపాస్యా నన్యదాఖ్యానజాతం ।
మాస్మార్షం మాధవ త్వామపి భువనపతే చేతసాపహ్నువానాన్
మాభూవం త్వత్సపర్యా వ్యతికరరహితో జన్మ జన్మాంతరేపి ॥ 15

తా. హే జగన్నాథా! మాధవ! నీ పాదారవిందములయందు క్షణమైనను భక్తి నిలుపని పుణ్యహీనులను కంటితో చూడను. చేవికింపైన బంధము కలదయినను చరిత్రము తప్ప వేరొక కథాసందర్భమును చెవితో వినను. (ఈ రెండింటిచేత జ్ఞానేంద్రియ నిగ్రహమును సూచించిరి) మానసికముగా నీ అస్తిత్వమును అంగీకరింపని వారలను (అసత్పురుషులను) నేను స్మరింపను. దీనిచే మనో నిగ్రహము సూచింపబడినది) జన్మజన్మాంతరములందును నీ కైంకర్యములేని మనుగడను కలిగియుండను.(దీనిచే కర్మేంద్రియ నిగ్రహము సూచింపబడినది.)

**జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం**

**పాణి ద్వంద్వ సమర్చయాచ్యుత కథాః శ్రోత్రద్వయ త్వం శృణు ।**

**కృష్ణం లోకయ లోచనద్వయ హరేర్గచ్ఛాంఘ్రి యుగ్మాలయం**

**జిఘ్రఘ్రాణ ముకుంద పాదతులసీం మూర్ధన్నమాధోక్షజం ॥** 16

తా. ఇంద్రియ నిగ్రహం రెండు రకాలు. చేయకూడని వాని నుండి మరలించుట, చేయ వలసిన వానిని చేయుట. ఈ శ్లోకమందు జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనస్సులచే చేయదగిన వానిని చెప్పుచున్నారు.

ఓ పాద ద్వంద్వమా(రెండు కాళ్ళు)! నీవు భగవదాలయమునకు నడుచుచుండుము.

ఓ హస్త ద్వంద్వమా(రెండు చేతులు)! నీవు భగవదార్చన చేయుచుండుము.

ఓ వాగింద్రియమా(నోరు)! నీవు కేశవుని కీర్తింపుచుండుము.

ఓ శిరమా (తల)! నీవు భగవంతుని నమస్కరించుచుండుము.

**ఇట్లు కర్మేంద్రి యములను నిగ్రహింప వలెను.**

ఓ నేత్రద్వంద్వమా(రెండు కన్నులు) ! శ్రీకృష్ణభగవానునే చూడుము.

ఓ శ్రోత్రద్వంద్వమా (రెండు చెవులు)! ఆ శ్రీకృష్ణుని లీలలనే వినుము.

ఓ నాసికా ( ముక్కు) ముకుందుని పాదపద్మాలను అలంకరించి ఉన్న తులసిని ఆఘ్రాణించు.

**ఇట్లు జ్ఞానేంద్రియములను నిగ్రహింపవలెను.**

ఓ మనసా! ఆ శ్రీధరునే ధ్యానింపుము.

**ఈ విధంగా మనస్సును నిగ్రహింపవలెను.**

**హేలోకాః శృణుత ప్రసూతి మరణ వ్యాధేశ్చికిత్సా మిమాం**
**యోగజ్ఞాః సముదాహరంతి మునయో యాం యాజ్ఞవల్క్యాదయః।**
**అంతర్జ్యోతిరమేయ మేకమమృతం కృష్ణాఖ్యమాపీయతాం**
**తత్పీతం పరమౌషధం వితనుతే నిర్వాణ మాత్యంతికం॥** 17

తా. ఓ లోకులారా! చావుపుట్టుకలనే వ్యాధికి యోగమెరింగిన యాజ్ఞవల్క్యాదులగు మునులు కనిపెట్టిన ఈ చికిత్సను వినుడు, వారు కనుగొనిన దివ్యౌషదం "కృష్ణామృతము". దానిని సేవించినచో పై వ్యాధులు శాశ్వతముగా తొలగిపోవును. ఆ ఔషదం ప్రకాశవంతము, అద్వితీయము, ఇట్టిదని చెప్పనలవికానిదియునై వెలయుచుండును.

**హే మర్త్యాః! పరమం హిత శృణుత వో వక్ష్యామి సంక్షేపతః**
**సంసారార్ణవ మాపదూర్మి బహుళం సమ్యక్ప్రవిశ్య స్థితాః।**
**నానాజ్ఞానమపాస్య చేతసి నమో నారాయణాయేత్యముం**
**మంత్రం సప్రణవం ప్రణామసహితం ప్రావర్తయధ్వం ముహుః॥** 18

తా. ఆపదలనెడి కెరటములతో నిండిన సంసారమనెడి సముద్రములో చొచ్చియున్న ఓ మర్త్యులారా! వినుడు. మీకు సంగ్రహముగా ఒక ఉపాయమును చెప్పెదను. అనన్యమగు భక్తితో తదితర చింతనములను విడచి మనసున "ఓం నమో నారాయణాయ" అను ఈ మంత్రమును జపించండి. ఇది ఒక్కటే చాలు

**పృథ్వీ రేణురణుః పయాంసి కణికాః ఫల్గుస్ఫులింగో లఘుః**
**తేజో నిశ్వసనం మరుత్ తనుతరం రంధ్రం సుసూక్ష్మం నభః।**
**క్షుద్రా రుద్రపితామహ ప్రభృతయఃకీటాస్సమస్తాస్సురాః**
**దృష్టే యత్ర స తావకో విజయతేభూమావధూతావధిః॥** 19

తా. పరబ్రహ్మ స్వరూపమగు నారాయణుని దర్శించినచో అందు ఈ పృథ్వి ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన రేణువు. ఈ జగము నీటి తుంపర. తేజస్సు సూక్ష్మమగు అగ్నికణము. వాయువు నిస్శ్వాసము. ఆకాశము

సన్నని చిన్న రంధ్రము. రుద్రా పితామహాది దేవతాకోటి సమస్తము క్షుద్ర కీటకములు. ఆ పరబ్రహ్మమగు నారాయణుని అతిశయము అవధులు మీరి విరాజిల్లు చున్నది.

**బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రైస్సరోమోద్గమైః**
**కంఠేన స్వరగద్గదేన నయనేనోద్గీర్ణ బాష్పాంబునా ।**
**నిత్యం త్వచ్చరణారవిందయుగళ ధ్యానామృతా స్వాదినాం**
**అస్మాకం సరసీరుహాక్ష, సతతం సంపద్యతాం జీవితం ॥** 20

తా. ఓ పుండరీకాక్షా! మేము ఎల్లప్పుడూ, మా మనస్సులో నీ పాదారవిందాలను ధ్యానిస్తూ, ఆనందం అనుభవిస్తూ, చేతులు జోడించి, శిరస్సు వంచి నమస్కారం చేసేటట్లును, కంఠం గద్గదమయ్యేటట్లును, శరీరం పులకాంకితమై ఉండేటట్లును, కన్నులు ఆనందభాష్పాలతో నిండేటట్లును, మేము జీవించి ఉన్నంత కాలం ఇలానే జరిగేటట్లుగా అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నాను.

**హే గోపాలక! హే కృపాజలనిధే! హే సింధుకన్యాపతే!**
**హే కంసాంతక! హే గజేంద్ర కరుణాపారీణ! హే మాధవ ।**
**హే రామానుజ! హే జగత్త్రయ గురో! హే పుండరీకాక్ష మాం!**
**హే గోపీజననాథ! పాలయ పరం జానామి న త్వాం వినా ॥** 21

ఓ గోపాలా! దయాసాగరా! లక్ష్మీపతే! కంసుని హతమార్చిన స్వామీ, గజేంద్రుని సంరక్షించిన మహాప్రభో, మాధవా, రామానుజా, త్రిలోకపూజిత గురువరేణ్యా, పద్మనేత్రుడా, గోపీజన వల్లభా, నన్ను రక్షించు. నిన్ను వినా నేను మరెవ్వరినీ ఎరుగను.

**భక్తాపాయభుజంగగారుడమణిః త్రైలోక్యరక్షామణిః**
**గోపీలోచన చాతకామ్బుద మణిః స్సౌందర్యముద్రామణిః ।**
**యః కాన్తామణి రుక్మిణీ ఘన కుచ ద్వన్ద్వైకభూషామణిః**
**శ్రేయో దేవ శిఖామణిర్దిశతు నో గోపాలచూడామణిః ॥** 22

తా. సంసార వ్యాధిగ్రస్థులకు ఆ వ్యాధి నివారణకు మణిమంత్రఔషధములను ఉపదేశించుచున్నారు. దేవతాశిఖామణి గోపాలచూడామణి మనకు శ్రేయస్సు ఒసంగుగాక! దేవతాంతరముల కంటె గోపాలుడగు శ్రీకృష్ణదేవుడు శ్రేయస్సులు ఒసంగుటలో సులభుడు. అతని కాంతామణి అగు రుక్మిణీదేవి కుచద్వంద్వమునకు అనన్య సాధారణమగు భూషణమణి. సాక్షాత్ లక్ష్మియే రుక్మిణి. వారిద్దరూ మణి, మణిప్రభలవలె ఒకరినొకరు విడువకుందురు. అందుచే ఆ రుక్మిణీ మనోవల్లభుడే మనకు శ్రేయఃప్రదుడు. ఆ విధంగా ఆమెకు అలంకారముగా ఉందుటచే అతడు సౌందర్యముద్రామణి. లోకములో ఇది అందమైన వస్తువని నిరూపించుటకు ఆ కృష్ణసౌందర్యము ముద్ర పడవలెను. ఆ అందమును చూసి పరవశులై గోపికలు తమ లోచన చాతకములచే ఆ కృష్ణమేఘమునే సేవించుచుందురు. ఈ మేఘము కేవలము చాతకములనే కాదు, మూడులోకములను తన కృపాశక్తిచే రక్షించుమణి. ఈ రక్షామణి మూడులోకములను రక్షించునదియే ఐనను భక్తుల పట్ల గారుడ, మణియై వారికి కలుగే అపాయములనెడి భుజంగములను (పాములను) దరిచేరకుండ తొలగించును.

**శతృచ్ఛేదైక మంత్రం సకలముపనిషద్వాక్య సంపూజ్య మంత్రం**

**సంసారోత్తారమంత్రం సముపచిత తమస్సంఘ నిర్యాణ మంత్రం ।**

**సర్వైశ్వర్యైక మంత్రం వ్యసన భుజగ సందష్ట సంత్రాణ మంత్రం**

**జిహ్వే! శ్రీకృష్ణమంత్రం జప జప సతతం జన్మసాఫల్య మంత్రం ॥** 23

తా. ఓ జిహ్వే! (ఓ నాలుకా) శ్రీకృష్ణ మంత్రమును సర్వదా జపింపుము. అదియే జన్మకు సాఫల్యము ఇచ్చునది. ఆ మంత్రము, కామాది శత్రువులను భేదించుటలో ప్రధాన సాధనం. సర్వోపనిషద్ వాక్యములు ఆ మంత్రమునే పూజించినవి. జననమరణములనెడి సంసారము నుండి తరింపచేయగల మంత్రమది. రాశీభూతమైన అవిద్యాంధ కారమును నశింపజేయు మంత్రము. ఆ మంత్రమే సర్వైశ్వర్యములను ఇచ్చెడిది. వ్యసనములనెడి సర్పములు కాటువేసినప్పుడు కాపాడగల మంత్రము. కనుక శ్రీకృష్ణ మంత్రమును సర్వదా జపింపుము.

**వ్యామోహ ప్రశమౌషధం మునిమనోవృత్తి ప్రవృత్త్యౌషధం**

**దైత్యేంద్రార్తికరౌషధం త్రిభువనీ సంజీవనైకౌషధం ।**

**భక్తాత్యంతహితౌషధం భవభయప్రధ్వంసనైకౌషధం**

**శ్రేయః ప్రాప్తికరౌషధం పిబ మనః శ్రీకృష్ణదివ్యౌషధం ॥** 24

తా. వ్యామోహాన్ని శమింపజేసే ఔషధము, మనోవృత్తులను నశింపచేసి స్థిమితాన్ని చేకూర్చే ఔషధము,రాక్షసులనే ఘోర వ్యాధులను తెగనరికే ఔషధము, సంజీవిని అనే ఔషధంలా ముల్లోకాలను ఉజ్జీవింపచేసే ఔషధము, భక్తులకు అత్యంత హితాన్ని చేకూర్చే ఔషధము, సంసారమనే భయమును ధ్వంసం చేసే ఔషధము, శ్రేయస్సును ప్రసాదించే ఔషధము అయిన 'శ్రీకృష్ణనామ'మనే దివ్యౌషధాన్ని ఓ మనసా! నీవు పానం చేయి

**ఆమ్నాయాభ్యసనాన్యరణ్యరుదితం వేదవ్రతాన్యన్వహం**

**మేదశ్ఛేదఫలాని పూర్తవిధయః సర్వే హుతం భస్మని ।**

**తీర్థానామవగాహనాని చ గజస్నానం వినా యత్పద**

**ద్వంద్వాంభోరుహసంస్మృతిర్విజయతే దేవస్సనారాయణః ॥** 25

తా. భగవంతుడైన శ్రీమన్నారాయణుని పాదపద్మాలపై స్మరణ లేకపోతే ఎన్ని వేదాలు చదివినా ప్రయోజనం లేదు. ఆ వేదాల్లో చెప్పబడిన కర్మలు ఎన్ని చేసినా ఫలం లభించదు. పుణ్యకర్మలు చేసినా ఫలిత ముండదు, పుణ్యతీర్థాలలో స్నానం చేసినా, బూడిదలో పోసిన నా
పన్నీరుకు సమమవుతుంది. ఏనుగు స్నానానంతరం తన దేహం మీద మట్టిని పోసుకున్నట్లు, దైవచింతనలేని పుణ్యకర్మలన్నీ వ్యర్థమే అవుతాయి

**శ్రీమన్నామ ప్రోచ్య నారాయణాఖ్యం**

**కేన ప్రాపుర్వాంఛితం పాపినోపి ।**

**హా నః పూర్వం వాక్ప్రవృత్తా న తస్మిన్**

**తేన ప్రాప్తం గర్భవాసాదిదుఃఖం ॥** 26

తా. ఎంత పాపం చేసిన వారైనప్పటికీ 'నారాయణ' అనే పవిత్రనామాన్ని స్మరిస్తే సకల శుభాలు పొందుతారు. అయ్యో! నేను పూర్వం నా నోట ఆ నారాయణ మంత్రాన్ని ఉచ్చరించకపోయినందువల్లనే నాకీ జన్మము మరియు ఈ గర్భవాస దుఃఖం ప్రాప్తించింది.

**మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే**

**మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ ।**

**త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య**

**భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ ॥** 27

తా. హే మధుకైటభ మర్దనా! నేను ఎలాంటి యోగ్యతా లేనివాణ్ణి కాబట్టి నీ పాదసేవ చేయటానికి అనర్హుడనయ్యాను. కానీ నీ సేవక వర్గంలో నన్ను కట్టకడపటివానిగానైనా (నీ సేవ చేసి తరించిన దాసులకు, దాసులకు, వారి దాసులకు, దాసునిగానైనా) నియమించు.

ఈ మాత్రం దయ చూపించు. ఈ జన్మ ఎత్తినందుకు ఇదే సాఫల్యం.

**నాథే నః పురుషోత్తమే త్రిజగతామేకాధిపే చేతసా**

**సేవ్యే స్వస్య పదస్య దాతారి సురే నారాయణే తిష్ఠతి ।**

**యం కంచిత్పురుషాధమం కతిపయగ్రామేశమల్పార్థదం**

**సేవాయై మృగయామ హే నరమహోమూకా వరాకా వయం ॥** 28

తా. ప్రభూ! మాకు నాథుడు, పురుషోత్తముడు, మూడు లోకములకు ఏకైకనాథుడు, మనసు మాత్రముచేత సేవింపదలచినవాడు, సేవించిన వారికి తనపదవి ఇచ్చేవాడు, దేవతామూర్తి అగు నారాయణుడుండగా, మాతో ఏ సంబంధము లేని ఒకానొక మానవాధముని ఏ కొలది గ్రామములకో అధిపతి అగు వానిని, అల్పాల్పములగు ఫలములను ఇచ్చే, ఒక మానవమాత్రుని సేవించుటకై తహతహలాడుచున్నాము. అహో! ఏమి మా జాడ్యము! నారాయణుని సేవింపక, నరుని సేవించు వారిని ఏమనాలి.

**మదన! పరిహర స్థితిం మదీయే**

**మనసి ముకుంద పదారవింద ధామ్ని ।**

**హరనయన కృశానునా కృశోసి**

**స్మరసి న చక్రపరాక్రమం మురారేః ॥** 29

తా. ఓ మన్మథుడా! భగవంతుని పాదారవిందాలను ధ్యానించు. నా మనస్సులో మోహం కలిగించకు.హరుని కంటి మంటలకన్నా తీక్షణమైన నారాయణుని సుదర్శన చక్రం యొక్క శక్తిని నీ వెరుగకున్నావేమో!

**తత్త్వం బ్రువాణాని పరం పరస్మాత్**

**మధు క్షరంతీవ సతాం ఫలాని ।**

**ప్రావర్తయ ప్రాంజలిరస్మి జిహ్వే**

**నామాని నారాయణ గోచరాణి ॥** 30

తా. ఓ జిహ్వా! దోసిలియొగ్గి ప్రార్థించుచున్నాను. పరతత్వమగు నారాయణుని ప్రతిపాదించుచూ, సత్పురుషులకు అమృతమును స్రవించు ఫలముల వంటివైన ఆయన నామములను మరల మరల ఉచ్చరింపుము.

**ఇదం శరీరం పరిణామపేశలం**

**పతత్యవశ్యం శ్లథసంధిజర్జరం ।**

**కిమౌషధైః క్లిశ్యసి మూఢ దుర్మతే**

**నిరామయం కృష్ణరసాయనం పిబ ॥** 31

తా. ఓ మూఢుడా! దుర్మతీ! ఈ శరీరము అనేక సంధులు కలిగి స్వాభావికంగా దుర్బలమైంది. వయస్సు మళ్ళినప్పుడు మరింత దుర్బలమౌతుంది. వృద్ధావస్థలో కీళ్ళనొప్పుల లాంటి ఎన్నో రోగాలతో కృశించి నశించక తప్పదు. దీని చికిత్స కోసం ఎన్ని ఔషధాలు సేవించినా రోగాలు ఆగవు మరియు మరణాలు లేకపోతాయా? అందువల్ల ఇలాంటి ఉపద్రవాలు లేకుండా ఉండటానికి 'శ్రీకృష్ణనామం' అనే ఉత్తమ ఔషధాన్ని పానం చేయి.

**దారా వారాకరవరసుతా తే తనూజో విరించిః**

**స్తోతా వేదస్తవ సురగణో భృత్యవర్గః ప్రసాదః ।**

**ముక్తిర్మాయా జగదవికలం తావకీ దేవకీతే**

**మాతా మిత్రం బలరిపు సుతస్త్వయ్యతోన్యన్న జానే ॥** 32

తా. కృష్ణా! జలనిధి (సముద్రుని) పుత్రికయగు లక్ష్మి నీ భార్య. బ్రహ్మ నీ కుమారుడు. వేదము (వేద పురుషుడు) నిన్ను స్తోత్రం చేసే పాఠకుడు. దేవతాగణము నీ భృత్యకోటి. మోక్షము నీ అనుగ్రహము. ఈ జగత్తు నీమాయ. దేవకీదేవి నీ తల్లి. ఇంద్రపుత్రుడగు అర్జునుడు నీ మిత్రుడు. అట్టి నీకంటే ఇతర దైవమును ఎవరిని నేను ఎరుగను.

**కృష్ణో రక్షతు నో జగత్త్రయ గురుః కృష్ణం నమస్యామ్యహం,**

**కృష్ణేనామరశత్రవో వినిహితాః కృష్ణాయ తస్మై నమః ।**

**కృష్ణాదేవ సముత్థితం జగదిదం కృష్ణస్య దాసోస్మ్యహం**

**కృష్ణే తిష్ఠతి సర్వమేతదఖిలం హే కృష్ణ రక్షస్వ మాం ॥** 33

తా. కృష్ణుడు జగత్రయ గురువు. మమ్ములను రక్షించుగాక! ఆ కృష్ణుని నేను నమస్కరించు చున్నాను. కృష్ణుని చేత రాక్షసులు చంపబడిరి. ఆ కృష్ణుని కొరకు నమస్కరించు చున్నాను. కృష్ణుని నుండి ఈ జగత్తు బయటపడినది. ఆ కృష్ణునకు నేను దాసుడను. కృష్ణుని యందే ఈ సర్వజగత్తు నిలిచియున్నది. ఓ కృష్ణా! నన్ను రక్షింపుము.

**తత్త్వం ప్రసీద భగవన్ కురు మయ్యనాథే**

**విష్ణోకృపాం పరమకారుణికః కిల త్వం ।**

**సంసారసాగరనిమగ్నమనంత దీనం**

**ఉద్ధర్తుమర్హసి హరే పురుషోత్తమోసి ॥** 34

తా. స్వామీ! అనంతమైన సంసారసాగరంలో మునిగి బాధపడుతున్న ఈ దీనుని కటాక్షించుము. పరమ కారుణ్యమూర్తివైన నీవు తప్ప నన్ను మరెవ్వరూ రక్షింపలేరని నిన్నే నమ్మి ఉన్నాను. పురుషోత్తముడివైన నీవే నన్ను ఆదుకోవాలి.

**నమామి నారాయణ పాదపంకజం**

**కరోమి నారాయణ పూజనం సదా ।**

**వదామి నారాయణ నామ నిర్మలం**

**స్మరామి నారాయణ తత్త్వమవ్యయం ॥** 35

తా. శ్రీమన్నారాయణుని పాద పద్మములకే నమస్కరింతును. నారాయణునే సదా పూజింతును. నారాయణుని నిర్మలమగు నామమునే కీర్తింతును. శాశ్వతమగు నారాయణ తత్వమునే స్మరింతును.

**శ్రీనాథ! నారాయణ! వాసుదేవ!**

**శ్రీకృష్ణ! భక్తప్రియ! చక్రపాణే ।**

**శ్రీపద్మనాభాచ్యుత! కైటభారే!**

**శ్రీరామ! పద్మాక్ష! హరే! మురారే ॥** 36

**అనంత! వైకుంఠ! ముకుంద! కృష్ణ!**

**గోవింద! దామోదర! మాధవేతి,**

**వక్తుం సమర్థోపిన వక్తి కశ్చిత్**

**అహో జనానాం వ్యసనాభిముఖ్యం ॥** 37

తా. శ్రీనాథ! నారాయణ! వాసుదేవ! శ్రీకృష్ణ! భక్తప్రియ! చక్రపాణి! శ్రీపద్మనాభ! అచ్యుత! కైటభారీ! శ్రీరామ! పద్మాక్ష! హరీ! మురారీ! అనంత! వైకుంఠ! ముకుంద! కృష్ణ! గోవింద! దామోదర! మాధవ! అని పలుకగలిగిన మనుజుడు, భగవంతుని పవిత్ర నామాలను ఉచ్చరించటానికి మానవులకు సామర్థ్యమున్నా మానవు లెవ్వరూ అలా ఉచ్చరించ లేకుండా పోవటం ఎంత దురదృష్టకరం. కేవలం స్మరణ మాత్రమున అభీష్టఫలాలు ప్రసాదించే భగవన్నామాన్ని విస్మరించి జనులు క్లేశకరములైన కార్యాలలో ఆసక్తులై, జూదం మొదలగు అనవసరమైన మరియు అశాశ్వతములైన వ్యసనాలతో మరియు కార్యకలాపాలతో కాలం గడుపుతూ ఉండటం ఎంతో శోచనీయం.

**ధ్యాయంతి యే విష్ణుమనంతమవ్యయం**

**హృత్పద్మమధ్యే సతతం వ్యవస్థితం ।**

**సమాహితానాం సతతా భయప్రదం**

**తేయాంతి సిద్ధిం పరమాంచ వైష్ణవీం ॥** 38

తా. అనంతుడు, అవ్యయుడు, హృదయ పద్మములో సదా వెలసి ఉండేవాడు, స్థిరచిత్తులై ఉండే వారికి ఎల్లప్పుడూ అభయమిచ్చేవాడు అయిన శ్రీ మహావిష్ణువును ఎవరు సదా ధ్యానం చేస్తారో వారికి

ఆ భగవదనుగ్రహం వల్ల సకలాభీష్టసిద్ధి కలుగుతుంది మరియు విష్ణు సంబంధమనెడి పరమసిద్ధిని పొందుదురు.

**క్షీరసాగర తరంగశీకరా-**

**సారతారకిత చారుమూర్తయే ।**

**భోగిభోగ శయనీయశాయినే**

**మాధవాయ మధువిద్విషే నమః ॥** 39

తా. క్షీరసాగరమున తరంగముల జల్లులచే అచ్చటచ్చట నక్షత్రములు పొడమినట్లున్న సుందర విగ్రహుడు, శేషభోగ శయ్యపై పవళించిన మధుసూదనుడగు మాధవునికి నమస్కారము.

**యస్య ప్రియౌ శ్రుతిధరౌ కవిలోకవీరౌ**

**మిత్రే ద్విజన్మవరపద్మ శరావభూతామ్ ।**

**తేనామ్బుజాక్ష చరణామ్బుజ షట్పదేన**

**రాజ్ఞా కృతా కృతిరియం కులశేఖరేణ ॥** 40

వేదవిద్యా ప్రతిష్ఠాపకులు, కవిలోక వీరులు అగు "ద్విజన్మ పద్మశరులు" ఎవరికీ మిత్రులై ఉండిరో, ఆ పుండరీకాక్ష పదాంబుజ భ్రుంగమగు కులశేఖర మహారాజు ఈ కృతిని నిర్మించెను.

కులశేఖరునకు ద్విజన్మవరుడు, పద్మశరులను ఇద్దరు మిత్రులుండిరి. ఆ ద్విజన్మవరుడు వ్యాసుడో, వాల్మీకియో అయి ఉండివలెననియు, పద్మశరుడు శఠగోపులనెడి ఆళ్వారు(నమ్మాళ్వారు) అనియు పెద్దలు చెప్పుచుందురు. అందు కవిలోక వీరుడనుటచే ఆదికవియగు వాల్మీకియే ద్విజన్మవరుడని, ఆయన శ్రీరామాయణమున వేదోపబృంహణము (బృహత్తరము) చేయుటచే శృతిధరుడు అనియు చెప్పవచ్చును. తమిళమున, సంస్కృతమున ప్రసిద్ధులగు కవులలో శఠగోప, వాల్మీకులు ఆద్యులు కనుక వారినే ఇక్కడ పేర్కొనెనని చెప్పవచ్చును. శఠగోపునకు "మారన్" అని తమిళ నామము. మారుడనగా, మన్మథుడు. కనుక దానికి సంస్కృత పర్యాయమగు పద్మశరుడు అని ఇందులో ప్రయోగింపబడినది.

|| ఇతి ముకుందమాల స్తోత్రం సంపూర్ణం ||

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు